

మృతదేహంతో హైవేపై ఆందోళన

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన మృతదేహంతో స్థానికులు హైవేపై ఆందోళనకు దిగారు. - 10లో..



డబ్బు కోసం చిన్నమ్మనే హతమార్చాడు

డబ్బు కోసం ఓ వ్యక్తి తన చిన్నమ్మకు కూల్‌డ్రింక్‌లో పాదరసం కలిపి తాగించి బైక్ నుంచి పడి మృతిచెందినట్లు సృష్టించేందుకు ప్రయత్నించాడు. - 10లో..

గరిష్టం/కనిష్టం 23/22

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడతాయి. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్రిస్మస్ పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలి

ఒంగోలు సిటీ: ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యేలు, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు చుండూరు రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్ ఆకాంక్షించారు. ప్రేమ, కరుణ, దయ, జాలి, క్షమాగుణాలను కలిగిన ఏసుక్రీస్తు జీవితం సర్వమానవాళికి ఆదర్శప్రాయమన్నారు.

క్రీస్తు చూపిన కరుణ, ప్రేమ మార్గంలో నడవాలి

ఒంగోలు అర్బన్: క్రీస్తు చూపిన కరుణ, ప్రేమ, సహనం తదితర మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోరుతూ క్రైస్తవులందరికీ కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు మనుషులను సన్మార్గంలోకి నడిపిస్తాయని అన్నారు.

రేపు ఒంగోలులో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ

ఒంగోలు టౌన్: దేశంలోని నిరుపేదల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ ఒంగోలులో ఈ నెల 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి బస్టాండు నుంచి బయలుదేరి రీడింగ్ రూం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, ప్రజా నాట్యమండలి గౌరవ సలహాదారు నల్లూరి వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యుదయవాదులు, విద్యావంతులు, పార్టీ అభిమానులు, ప్రజలు విరివిగా సభలను జయప్రదం చేయాలని కోరారు.

జిల్లాలో సరాసరి 2.9 మి.మీ వర్షపాతం

- చల్లటి గాలులతో ప్రజల ఇబ్బందులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మంగళవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చలిగాలులతో కూడిన చిరుజల్లులు ప్రజలను వణికించాయి. జిల్లాలో సరాసరి 2.9 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పెద్ద వర్షం లేకపోయినా తుప్పర్లతో వర్షం కురిసింది. వాతావరణం బాగా చల్లబడటంతో ప్రజలు చలితో వణికిపోయారు. అత్యధికంగా కొత్తపట్నం మండలంలో 11.4 మి.మీటర్ల వర్షపాతం కురవగా జరుగుమల్లి 10, నాగులుప్పలపాడు 8, చీమకుర్తి 7, ఒంగోలు, తాళ్లూరు 6.4, సంతనూతలపాడు, మద్దిపాడు 6, సింగరాయకొండ 5.8, కొండపి 5.4, దర్శి, టంగుటూరు 4.2, ముండ్లమూరు 3.8, పొన్నలూరు 3.2, మర్రిపూడి 3, యర్రగొండపాలెం, దొనకొండ, మార్కాపురం, కొనకనమిట్ల, కనిగిరి, పామూరుల్లో 2, సీఎస్‌పురం 1.4, పెద్దారవీడు 1.2, కురిచేడు, తర్లుపాడు, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల మండలాల్లో 1 మి.మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముతో పాటు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా చర్యలను పరిశీలించారు. అనంతరం గోదాము రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. దీనిలో కలెక్టర్‌తో పాటు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కోనేటి వెంకటరావు, రాశేఖర్, రసూల్, రఘురామ్, సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో సర్వాంగ సుందరంగా ముస్తాబైన జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి

లోకరక్షకుని రాక కోసం..


పాప పంకిలమైన జగత్తును తన పరిశుద్ధాత్మతో సంస్కరించిన లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మించిన క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లాలోని చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. రంగులతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలుచోట్ల క్రీస్తు జీవితచరిత్రను తెలిపే సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. క్రీస్తు రాకడను స్వాగతిస్తూ మంగళవారం అర్ధరాత్రి చర్చిలలో స్తుతి గీతాలను ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- సాక్షి, ఒంగోలు



ఒంగోలులో ఆకట్టుకున్న శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీ అలంకరణ

పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఉన్నత శ్రేణిలో పాసై మంచి మార్కులు తెచ్చుకోవాలంటే ముందస్తు ప్రణాళిక అవసరం. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు లేకపోవడం, పరీక్షలు దగ్గర పడుతున్నా ఇంతవరకూ ఆల్ ఇన్ ఒన్ గైడ్లు అందకపోవడంతో పాస్ అవడమే గగనంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. సంక్షేమ శాఖ మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి సొంత జిల్లాలో పదో తరగతి విద్యార్థుల దుస్థితి ఇది.



పది డోలాయమానం!

- సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థుల ఆందోళన
- 100 రోజుల ప్రణాళికను మరచిన అధికారులు
- ఇంతవరకూ అందని ఆల్ ఇన్ వన్ గైడ్‌లు
- పరీక్షలు దగ్గర పడుతున్నా అధికారుల్లో కానరాని చలనం
- ట్యూటర్లకు అందని వేతన బకాయిలు
- సంక్షేమ శాఖ మంత్రి సొంత జిల్లాలో దుస్థితి

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల శాఖల పరిధిలో పదో తరగతికి సంబంధించి 86 వసతి గృహాల్లో 1679 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి అంటే విద్యార్థుల ఉన్నత భవితకు తొలిమెట్టు. ఇందులో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులు తపన పడుతుంటారు. సరైన ప్రణాళికలు లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ అయోమయంలో పడింది. మంచి మార్కుల సంగతి అటుంచితే ఉత్తీర్ణత అయ్యేదే కష్టంగా మారిందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పది పరీక్షలకు మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఇంత వరకూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు, ఆల్ ఇన్ వన్ గైడ్లు అందలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ, ఆల్ ఇన్ ఒన్ గైడ్లు ప్రభుత్వమే అందించేది. ఉత్తమ ఫలితాల సాధన కోసం ముందుగా 100 రోజుల ప్రణాళికను అధికారులు అమలు పరిచేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో పరీక్షలు దగ్గర పడుతున్నా ఎలాంటి ముందస్తు ప్రణాళికలు కనిపించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ట్యూటర్లకు అందని గౌరవ వేతనం..

వసతి గృహాల్లో 10 మంది కంటే ఎక్కువ మంది పదో తరగతి చదివే విద్యార్థులు ఉంటే తప్పనిసరిగా ప్రత్యేక ట్యూటర్‌లను ఏర్పాటు చేయాలి. కష్టమైన సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక బోధన చెప్పాలి. లెక్కలు, సైన్స్, ఇంగ్లిషు, హిందీ సబ్జెక్టులలో ప్రత్యేక బోధన అవసరం. ముఖ్యంగా ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ.1500లను ప్రభుత్వం ఇస్తుంది. ఈ గౌరవ వేతనం తక్కువగా ఉండటంతో ఒక్క ట్యూటర్ రెండు, మూడు సబ్జెక్టులు చెబుతుండటంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. ఆగస్టు నుంచి ఇంత వరకూ ట్యూటర్లకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయలేదు. ఇప్పటి వరకూ దాదాపుగా రూ.4 లక్షలు చెల్లించాల్సి ఉంది. వస్తాయో రావో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

అందని ఆల్ ఇన్ ఒన్ గైడ్‌లు

ముఖ్యంగా అధికారుల నిర్లక్ష్యం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు శాపంలా మారింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పదో తరగతి విద్యార్థులందరికీ ఆల్ ఇన్ వన్ గైడ్‌లను అందించి ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులు విద్యార్థులను పట్టించుకోవడంలేదు. ఇంతవరకూ వారికి ఆల్ ఇన్ వన్ గైడ్‌లు అందలేదు. దీంతో వార్షిక పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉండడం శోచనీయం.

అమలు కాని 100 రోజుల ప్రణాళిక

వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులు సరిగ్గా చదువుతున్నారా, లేదా అనేది గుర్తించడం, వారిని చదివించడం, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించడం వంటివి 100 రోజుల ప్రణాళికలో భాగం. అయితే జిల్లా స్థాయి అధికారులు ఇంత వరకూ పట్టించుకోకపోవడం గమనార్హం. ముందస్తు ప్రణాళికలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు వసతి గృహ అధికారులతో టెలీ, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించాల్సి ఉంది. విద్యార్థులు ఎలా చదువుతున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలి అనే అంశాలను చర్చించాల్సి ఉంది. ఆ దిశగా అధికారుల చర్యలు చేపట్టకపోవడం పది విద్యార్థులకు శాపంగా మారింది.

చిన్నారుల దత్తత ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలి

- మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి



చిన్నారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

ఒంగోలు సిటీ: శిశుగృహంలోని చిన్నారుల దత్తత ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని, వారిని దత్తత తల్లిదండ్రుల చెంతకు చేర్చి వారికి ఒక కుటుంబం ఏర్పరచాలని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి సూచించారు. ఒంగోలులోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న బాలసదనం, శిశుగృహాలను సందర్శించడం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి మాట్లాడుతూ వారు ఎప్పుడు వచ్చారు, ఎందువల్ల వచ్చారు అని తెలుసుకొని వారిని తల్లిదండ్రుల చెంతకు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులకు సూచించారు. బాలసదనంలోని పిల్లలు ఎవరూ ఖాళీగా ఉండకూడదని, ప్రతి విద్యార్థి స్కూలుకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బాలసదనం చిన్నారులతో క్రిస్మస్ సెలబ్రేషన్స్ లో పాల్గొన్నారు. వారితో క్రిస్మస్ తాత వేషధారణ వేయించి కేకు పిల్లలచే కట్ చేసి క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యత చిన్నారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, మహిళ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హెన సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు
నలుగురు జిల్లా క్రీడాకారులు



వాటుపల్లి లోకేష్ సాయి



పుత్తూరి అంబరీష్



షేక్ ఆసీఫా



క్రిష్టంశెట్టి ప్రణీత

ఒంగోలు: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న వీరు ఈపీ, ఫాయల్ విభాగాల్లో ప్రతిభ చాటారు. పుత్తూరి అంబరీష్ – ఈపీ విభాగం (సిల్వర్), వి.లోకేష్ సాయి–ఈపీ విభాగం (బ్రాంజ్), ఎస్‌కే ఆసీఫా–ఈపీ విభాగం (బ్రాంజ్), క్రిష్టంశెట్టి ప్రణీత–ఫాయల్ విభాగం (బ్రాంజ్ మెడల్) సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఈ నలుగురు క్రీడాకారులు ఈనెల 31 నుంచి జనవరి 3వ తేదీ వరకు కేరళ రాష్ట్రం కన్నూర్ పట్టణంలోని ముండయాడ్ ఇండోర్ స్టేడియంలో జరిగే 35వ సీనియర్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోచ్‌లు బి.భరత్, ఆర్.విజయలక్ష్మి, డి.రాజు అభినందించారు.

అండర్ 12 క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన



ఎంపికైన అండర్ 12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు

ఒంగోలు: అండర్ 12 క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన లభించింది. స్థానిక మంగమూరు డొంక సబ్ సెంటర్ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 12 క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోచ్‌లు సుధాకర్, చంద్ర, లెఫ్ట్ శ్రీను, బాబూరావు పర్యవేక్షించారు. మొత్తం 50 మంది క్రీడాకారులు హాజరుకాగా వారి నుంచి 26 మందితో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశామని, వారికి ఈనెల 29 నుంచి బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల క్రికెట్ స్టేడియంలో రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ చూపిన వారితో తుది జట్టు ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. తుది జట్టుకు ఎంపికైన వారు జనవరి 9వ తేదీ నుంచి కృష్ణాజిల్లా మూలపాడులో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, సభ్యులు నవీన్, హనుమంతరావు, డాక్టర్ నామినేని కిరణ్, కొత్తూరు బలరాం, అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- పెంచిన విద్యుత్ చార్జీలు వెనక్కు తీసుకోవాలని ఈ నెల 27వ తేదీ పోరుబాట
- ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



పోరుబాట వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: అవసరమైతే కరెంటు చార్జీలు తగ్గిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించి చంద్రబాబు గద్దెనెక్కాడని ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ చేపట్టిన పోరుబాట నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మళ్లీ ఒకసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటే ఒకటి చెప్తాడు.. ప్రభుత్వంలో ఉంటే ఒకటి చేస్తాడని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కరెంటు చార్జీలు పెంచుతున్నారని అనేక ఆరోపణలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వస్తే పెంచబోనని, తగ్గిస్తానన్నారని చెప్పారు. నవంబరులో రూ.6072.86 కోట్లు, డిసెంబరులో రూ.9412.50 కోట్లు కలిపి మొత్తం రూ.15,485.36 కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా 200 యూనిట్లు ఇస్తే ప్రస్తుతం వాళ్ల ఇంటికి కూడా ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.1500, రూ.2 వేల వరకు బిల్లులు వస్తున్నాయన్నారు. ఉన్న జీఎస్టీలతోనే మోతమోగి ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల మీద జీఎస్టీ, ఆయిల్ పైన జీఎస్టీ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నాడన్నారు. వాహనాలు కొన్నప్పుడు రోడ్ ట్యాక్స్ కడతామని, కానీ రోడ్లపై ట్యాక్స్ పేరుతో ప్రజలను బాదుతున్నారన్నారు. మన డబ్బులతో పన్నులు వసూలు చేసి, సంపద సృష్టిస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసమో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. ఖిల్జీ, ఔరంగజేబు లాంటి సంస్కరణాభిలాష కలవాడు చంద్రబాబు అని ప్రజలు గుర్తెరగాలన్నారు. జనం చంద్రబాబుకు ఓట్లు వేస్తారని, తర్వాత ఆయన వాతలు పెడతాడని, ప్రజలు మళ్లీ గుర్తుకొచ్చి పొరపాటు పడ్డాం అని అనుకోవడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. మీ తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పిలుపునిచ్చారన్నారు. పెంచిన చార్జీలు వెనక్కు తీసుకోవాలని ఈ నెల 27వ తేదీ పోరుబాట లాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీగా వెళ్లి కరెంటు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వదలుచుకున్నామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఎస్ఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలుపుతామన్నారు. కరెంటు చార్జీలు తగ్గించే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ ఈ పోరుబాటలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జగనన్నకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోందని విమర్శించారు. ప్రజలకు పథకాలు ఇవ్వకపోగా ప్రజల నుంచే వసూళ్లకు చంద్రబాబు దిగాడన్నారు. ఓట్లేసిన ప్రజలను ముంచడంలో చంద్రబాబు కొత్త ఆలోచనలు చేస్తున్నాడన్నారు. అబద్ధాలతో ప్రజలను నిట్టనిలువునా ముంచేయడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు ఎప్పుడూ నిజం చెప్పే అలవాటు లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై మోపిన పన్నుల భారం రద్దు చేస్తానన్నారు. దేశ చరిత్రలో కరెంటు చార్జీలు రూ.15 వేల కోట్లకు పైగా ప్రజలపై భారం మోపిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. రైతులను గుర్రాలతో తొక్కించడం, రైతులపై కరెంటు చార్జీలు తగ్గించాలని పోరాటం చేస్తుంటే కాల్పులు జరిపిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలో వచ్చి చేయకుండా నిట్టనిలువునా మోసం చేశాడన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మేము అధికారంలోకి వస్తే విద్యుత్ పెంచనని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే కరెంటు చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, కె.కోటియాదవ్, నటారు జనార్దనరెడ్డి, గుడ్డల వెంకటేశ్వర్లు, వెంకయ్య నాయుడు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాల్లో అనర్హులు తీసివేయండి



అధికారులతో మాట్లాడుతున్న మాల కార్పొరేషన్ చైర్మన్ విజయబాబు

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల్లో అనర్హులను తీసివేయాలని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయబాబు అన్నారు. ఒంగోలులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్‌లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. దుకాణాల సముదాయాలకు అద్దె బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. గతంలో మంజూరు చేసిన రుణాల రికవరీలను వేగవంతం చేయాలన్నారు. రుణాల రికవరీలతోనే నూతన రుణాలు మంజూరు చేయగలమని తెలిపారు.



ఒంగోలు క్లౌపేటలో ప్రత్యేక ఆకర్షణగా క్రీస్తు జననం సెట్టింగ్



దొనకొండ ఆర్‌సీఎం చర్చిలో ఆకట్టుకున్న పశువుల పాక



ఒంగోలులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన క్రిస్మస్ ట్రీ

క్రీస్తు రాక కోసం...

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రీస్తు రాకను స్వాగతించేందుకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిల ముందు క్రీస్తు జననం సెట్టింగులు, క్రిస్మస్ ట్రీలు, విద్యుత్ దీపాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - సాక్షి నెట్‌వర్క్..



విద్యుత్ దీపాలంకరణలో ఒంగోలు పునీత చినథెరేసమ్మ చర్చి



ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో క్యాండిల్ సర్వీస్



మార్కాపురంలో విద్యుత్ వెలుగుల్లో తెలుగు బాప్టిస్టు చర్చి

మృతదేహంతో హైవేపై ఆందోళన



మృతదేహాన్ని ఆటోలో పెట్టుకొని రోడ్డుపై బైఠాయించిన మహిళలు



హైవే రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్

- చర్చి ఫాదర్ కుటుంబానికి న్యాయం చేయాలని బైఠాయించిన మహిళలు, స్థానికులు
- స్తంభించిన ట్రాఫిక్
- ఎస్సై హామీతో శాంతించిన మహిళలు

కంభం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మరియదాస్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో మంగళవారం అనంతపురం- అమరావతి జాతీయ రహదారిపై స్థానికులు, మహిళలు బైఠాయించారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..సోమవారం సాయంత్రం కందులాపురం కూడలిలో హైవే రోడ్డుపై కారు ప్రమాదానికి గురైన ఫాదర్‌ను నరసరావుపేట తీసుకెళ్తుండగా వినుకొండ వద్ద మృతి చెందారు. మృతదేహాన్ని తిరిగి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి భక్తుల సందర్శనార్థం మృతదేహాన్ని ఆర్‌సీఎం చర్చి వద్దకు తీసుకెళ్లి ప్రార్థనలు చేశారు. ఫాదర్ కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహాన్ని ఆటోలో తీసుకువెళ్లి కందులాపురం కూడలిలోని హైవేరోడ్డుపై బైఠాయించారు. హైవే దిగ్బంధం చేయడంతో హైవే రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. హైవే రోడ్డు కావడం, రైల్వే స్టేషన్, పట్టణంలోకి వెళ్లే రహదారి కావడంతో వెళ్లే దారి లేక ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మహిళలు, యువకులు ఫాదర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ హైవేపై బైఠాయించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నరసింహారావు ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం ఫాదర్ మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామమైన దొనకొండ మండలం సిద్ధయ్యపాలేనికి తీసుకెళ్లారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన డాక్టర్ వెంకయ్య



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో డాక్టర్ మాదాసి వెంకయ్య

సింగరాయకొండ: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మంగళవారం ఇడుపులపాయలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన షేక్ ఖాజా, బండారు భార్గవ్‌లు ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన బూర్కపు సూరజ్ ఆచారితో కలిసి కొన్ని రోజులుగా గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో 2 కేజీల గంజాయిని తెప్పించి విక్రయించేందుకు కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉండగా పక్కా సమాచారంతో వన్‌టౌన్ సీఐ వై. నాగరాజు సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.2.5 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బు కోసం చిన్నమ్మనే హతమార్చాడు

- కూల్ డ్రింక్‌లో పాదరసం కలిపి తాపించిన వైనం
- బైక్ నుంచి కిందపడి మృతి చెందినట్లు సృష్టించేందుకు ప్రయత్నం



కూటమి నాయకుడు ఎరిక్షన్‌బాబును సన్మానిస్తున్న నిందితుడు చెన్నయ్య(ఫైల్)

యర్రగొండపాలెం: డబ్బు కోసం చిన్నమ్మనే హతమార్చాడు. వివరాల్లోకి వెళితే..ఈ నెల 22వ తేదీన మండలంలోని గుర్రపుశాలకు చెందిన సింగారపు చెన్నయ్య తన తల్లి పెద్ద కోటమ్మ, పిన్ని చిన్న కోటమ్మలను ద్విచక్రవాహనంపై యర్రగొండపాలెంకు తీసుకువచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై నుంచి కిందపడి మరణించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బైక్‌పై నుంచి కిందపడినా ఆమె శరీరంపై ఎటువంటి గాయాలు కనిపించకపోవడంతో చిన్న కోటమ్మ అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. యర్రగొండపాలెంలో ఫోరెన్సిక్ డాక్టర్లు లేకపోవడంతో ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలలో ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పథకం ప్రకారమే హత్య...

గుర్రపుశాలకు చెందిన సింగారపు సంజీవయ్య.. అక్కాచెల్లెళ్లు పెద్దకోటమ్మ, చిన్న కోటమ్మలను వివాహం చేసుకున్నాడు. చిన్న కోటమ్మకు సంతానం కలగలేదు. ఆమెకు సంబధించిన బ్యాంకు అకౌంట్‌లో రూ. 10 లక్షలు నగదు, బంగారపు ఆభరణాలు, జనరల్ ఇన్సూరెన్స్, చంద్రన్న బీమాలతో పాటు పొలం ఉన్నట్లు తెలిసింది. టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న చెన్నయ్య పెద్ద కోటమ్మ కుమారుడు.. పార్టీ కార్యకలాపాలంటూ జులాయిగా తిరిగి అప్పుల పాలయ్యాడు. దీంతో పిన్ని నుంచి డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించగా ఆమె నీ పిల్లల పేరుతో బ్యాంకులో వేస్తానని తెగేసి చెప్పింది. దీంతో ఆమెను హత్య చేసేందుకు గతంలోనూ ప్రయత్నించాడు. ఈ క్రమంలో పొదుపు గ్రూపు డబ్బులు చేసేందుకు యర్రగొండపాలెం తీసుకువచ్చారు. ఆ సమయంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం చెన్నయ్య మార్కాపురంకు చెందిన ఒకరితో పాదరసం కలిపిన కూల్‌డ్రింగ్ తెప్పించి తాపినట్లు తెలిసింది. ఈ క్రమంలో మార్కాపురంలో నగదు డ్రా చేద్దామని చెప్పి కారులో తీసుకువెళుతుండగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురై మరణించింది.

కేసును మార్చేందుకు టీడీపీ నేతల కుట్ర

టీడీపీ నాయకులు కొంతమంది చెన్నయ్యను రక్షించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. బైక్‌పై నుంచి కిందపడి మరణించినట్లు, బైక్‌పై వెళ్తున్న సమయంలో ఆమెకు గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు కేసు నమోదు చేయించటానికి ప్రయత్నించారు. అందుకు కూడా బేరసారాలు ఆడినట్లు తెలిసింది. ఈ విషయాలను గుర్తించిన పోలీసులు మాత్రం అనుమానాస్పదంగా చిన్న కోటమ్మ మృతి చెందినట్లు కేసు నమోదుచేసి విచారణ చేపట్టడంతో వాస్తవాలు ఒక్కొక్కటికి బయటికి వస్తున్నాయి.

స్కూల్ బస్సు ఢీకొని రైతు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దదోర్నాల: స్కూల్ బస్సు ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళుతున్న రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం భ్రమరాంభా చెంచు కాలనీ సమీపంలో మంగళవారం జరిగింది. ప్రమాదంలో పెద్ద బొమ్మలాపురానికి చెందిన రైతు గుమ్మా వెంకటేశ్వర్లు(55) మృతి చెందాడు. ఈ సంఘటన సమయంలో బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో హై టెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టకుండా బస్సు కొద్ది దూరంలో నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైతు మృత్యువాత విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం వద్ద బోరున విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం..

మోటారు సైకిల్‌ను స్కూల్ బస్సు ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదమే తప్పింది. ఈ సంఘటనలో స్కూల్ బస్సు రోడ్డు పక్క నున్న పొదల్లోకి దూసుకెళ్లి హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి సమీపంలో నిలిచిపోయింది. బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఉండే హై టెన్షన్ విద్యుత్ తీగలు బస్సుపై పడి పెను ప్రమాదం సంభవించి ఉండేది. ప్రమాద సమయంలో బస్సు 40 మంది విద్యార్థులు ఉన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడు

- హాస్పిటల్ ఎదురుగా ఆందోళనకు దిగిన బాధితులు



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితుల

ఒంగోలు టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో మా కుమారుడు మరణించాడని మృతుని కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో నగరంలోని సత్యనారాయణపురంలో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బాధితుల కథనం ప్రకారం...నగరంలోని ఇస్లాంపేటకు చెందిన చాపల గోపయ్య, విజయ దంపతుల కుమారుడు వెంకట సాయినాథ్(22) ఇంటర్మీడియెట్ చదివి తండ్రికి చెందిన స్వీట్ వ్యాపారాన్ని చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా జ్వరం వస్తుండటంతో చికిత్స నిమిత్తం సత్యనారాయణపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో చేర్చారు. అయితే ఆస్పత్రిలో చేరిన వారం రోజులకు కూడా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో డిశ్చార్జి అయ్యారు. ఇంటికి వెళ్లిన అరగంటకే సాయినాథ్‌కు కడుపు ఉబ్బిపోయింది. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానికంగా మరో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వెంటనే నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరంగా నిర్ధారించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. దీంతో హైదరాబాద్ యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గత నెల 30న మరణించాడు. ఈ క్రమంలో వైద్యుల నిర్లక్ష్యంతోనే మా కుమారుడు చనిపోయాడని ఆస్పత్రి ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న సీఐ అజయ్‌కుమార్‌ను మహిళలు చుట్టుముట్టారు. హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఈ ఆసుపత్రిలో గత రెండు నెలల్లో ఈ విధంగా మృతి చెందడం ఇది మూడవ కేసని స్థానికులు చెబుతున్నారు.

నీటికుంటలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



మద్దిపాడు: మండలంలోని వెంకటరాజుపాలెం సమీపంలో ఉన్న బీఏకేఆర్ కళాశాల వద్ద జాతీయ రహదారికి పక్కనే ఉన్న నీటి కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుని శరీరంపై ఎటువంటి దుస్తులు లేవు. ఎడమ భుజంపై పులిబొమ్మ పచ్చబొట్టు ఉంది. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని మద్దిపాడు పోలీసులు తెలిపారు.

వస్తువుల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

- వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఒంగోలు ఎంపీ, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్

ఒంగోలు అర్బన్: వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు వాటి లైసెన్స్, ఎక్స్‌పైరీ తేదీ, ఎంఆర్‌పీ వంటి వాటిని గమనించడం, కొనుగోలు చేసిన వస్తువు తాలూకు బిల్లును తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గ్రీవెన్స్ హాలులో పలు ప్రభుత్వ శాఖలు, వినియోగదారుల సంఘాలతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులు ఏ విధంగా నష్టపోతున్నారనే అంశాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆ మేరకు వినియోగదారుల సంఘాలు, అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులకు అవగాహన కల్పించేలా రూపొందించిన మేలుకొలుపు పుస్తకాన్ని, పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కాలేజీల్లో నిర్వహించిన ఎస్ఏ రైటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. దీనిలో డీఎంహెచ్ఓ, వ్యవసాయ శాఖ, డ్రగ్స్, లీగల్ మెట్రాలజీ, ఆర్టీసీ, సివిల్ సప్లయిస్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.